## క్లుప్తంగా

### నేటి నుంచి కులగణన సర్వే

బంగారుపాళెం: మండలంలో శుక్రవారం నుంచి కులగణన సర్వే చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గ్రామ వలంటీర్ల ద్వారా కులగణన సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. కులగణన సర్వేపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించి గ్రామ వలంటీర్లకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు.

### లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

యాదమరి: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన గురువారం మండలంలోని బుడితరెడ్డి పల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో లింగనిర్ధారణపై గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతై లింగ నిర్ధారణ చేసినట్లు సమాచారం వస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భంలో ఉన్నది మగబిడ్డనా లేక ఆడబిడ్డనా తెలుసుకునేందుకు ఈ లింగ నిర్ధారణ పరీక్షలు రహస్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### నేడు చీకూరుపల్లెలో సురక్ష-2

బంగారుపాళెం: మండలంలోని చీకూరుపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

### అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని ఏడీఏ శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం సాయంత్రం ఏడీఏతోపాటు వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులు, మందులను మాత్రమే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. రికార్డులు సక్రమంగా ఉండాలని చెప్పారు. రైతులకు విక్రయించిన ఎరువులు, పురుగు మందులకు సంబంధించి తప్పకుండా బిల్లులు ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే లైసెన్సులను రద్దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చిట్టిబాబు, ఏఈఓ సాదరయ్య పాల్గొన్నారు.

### శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఐరాల: మండలంలోని పాతపాళ్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను భక్తులు గురువారం ఇంటింటా పంపిణీ చేశారు. ముందుగా ఓం శక్తి ఆలయంలో ఉంచిన అక్షింతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మహా మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో వేడుకలు నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు.

**అన్ని గ్రామాలకు అయోధ్య అక్షింతలు**



అక్షింతలను అందజేస్తున్న రామభక్తులు

గుడిపాల: గ్రామ గ్రామాన అయోధ్య రాముల అక్షింతలను అందజేస్తున్నట్లు రామభక్తులు తెలియజేశారు. చింతగుంటూరు, 197రామాపురం, రామాపురం దళితవాడ వీధుల్లో గురువారం తిరిగి అన్ని కుటుంబాలకు అక్షింతలను అందజేశారు. ఈ అక్షింతలను పూజగదుల్లో పెట్టుకొని జనవరి 22న అయోధ్య రామమందిర ప్రారంభసమయంలో అక్షింతలను కుటుంబంలోని వారు తలపై చల్లుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలోను 5 దీపాలను వెలిగించాలని తెలియజేశారు. ముందుగా గ్రామాల్లో భజనలు చేసుకుంటూ ఇంటింటా తిరిగి అయోధ్య అక్షింతలను అందజేశారు.

# మోసాన్ని ఉపేక్షించొద్దు

- వినియోగదారుల ఫిర్యాదులకు అవకాశం
- తూనికలు, కొలతల శాఖల్లో మోసాలకు చెక్
- టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏర్పాటు
- వినియోగించుకోవాలంటున్న అధికారులు



టోల్‌ఫ్రీ నంబరుతో ముద్రించిన కరపత్రం



చిత్తూరులో నూనె దుకాణంలో తనిఖీలు చేసిన లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య (ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుకు జరిగిన మోసాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించొద్దని రక్షణ చట్టం స్పష్టంగా చెబుతోంది. దీన్ని మరింత పటిష్టంగా మార్చింది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఆయా విభాగాలకు ఫిర్యాదుల కోసం వివిధ టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించారు. అయితే మోసపోయిన సమయంలో ఏ నంబర్ ఎవరి పరిధిలో వస్తుందో తెలియక కొనుగోలుదారులు ఫిర్యాదు చేసేందుకు అవస్థలు పడేవారు. దీన్ని గమనించి ప్రస్తుతం ప్రభుత్వం వాటన్నింటినీ కలిపి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ట్రోల్ ఫ్రీ నంబర్ 1967 ఏకైక నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో బాధితులు ఈ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుంది.

పాల నుంచి ఫార్మా కంపెనీల దోపిడీ వరకు బరువు, విలువ, కల్తీ, ఇలా సేవా లోపంపై ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా, వస్తువుల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు అయోమయానికి గురవుతుంటారు. అలాంటి వారికి చేతికి రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. ఫిర్యాదులు, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ 1967 నంబరును అందుబాటులో ఉంచింది. గతంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోళ్లలో ఎదుర్కొనే ఇబ్బందులను తెలియజేసేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి టోల్ ఫ్రీ నంబరు 18004250082 /1967కు, ఒకే దేశం ఒకే రేషన్ ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 18004253157/14445, రాష్ట్ర ఆహార భద్రత ఫిర్యాదులు, సలహాలు, సూచనలకు టోల్ ఫ్రీ నంబరు 1800 4252388 /155235, తూనికలు, కొలతలశాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004254205 అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరోశాఖకు వెళ్లేవి. అంతేగాక వినియోగదారుల అన్ని నంబర్లను గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్ ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 నంబరుతో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

**అన్ని రకాల ఫిర్యాదులు**

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాలశాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో తుకాల్లో మోసాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ బంకులు, బియ్యం, వంటనూనె, నిత్యావసర సరుకులు, మాంసం ఇతర వస్తువులు, తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. చేసిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేగాక నిర్దేశించిన సమయం తర్వాత ఫిర్యాదు ఏ దశలో ఉందో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

**సమస్యలు తెలపండి**



"వస్తువుల పరంగా బరువు, తూకంలో తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటాం. ప్రతి ప్యాకింగ్ పైనా వస్తువు పేరు, బరువు, తయారీ పరిశ్రమ వివరాలు, ఉండాలి. అందులో తేడాలు ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. బియ్యం, నూనె, పెట్రోలు, వంటనూనె, ఇలా పలు రకాల వస్తుసేవల లోపంపై 1967 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

– స్వామి, ఏసీ, తూనికల కొలతలశాఖ

# అంబేడ్కర్ అందరివాడు



బంగారుపాళెం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం: అంబేడ్కర్ అందరివాడని తెలిసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయ మహా శిల్పాన్ని ఏర్పాటు చేశారని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి బయలుదేరిన బస్సును గురువారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు బంగారుపాళెం ప్రభుత్వ పాఠశాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, విజయవాడలోని స్వరాజ్‌మైదానంలో ప్రభుత్వం 206 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్‌పై సీఎం జగన్‌కు ఉన్న అభిమానంతోనే అతిపెద్ద విగ్రహ నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా సీఎం జగన్ నవరత్నాలు రూపొందించారని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి ప్రతీకగా అంబేడ్కర్ మహాశిల్పం ఏర్పాటు ఆంధ్రరాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్



ఐరాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజు

తవణంపల్లె: గ్రామ పంచాయతీలు అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2024–25వ ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళిక తయారు చేయడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీల్లో సుస్థిరమైన అభివృద్ధే లక్ష్యంగా సమగ్రంగా ప్రణాళిక తయారు చేసి నివేదించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలసి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ గురువారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈశ్వర్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, డాక్టర్ ప్రియాంక, ఏపీఓ లలిత, ఈఓపీఆర్‌డీ కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ప్రణాళికలు సిద్ధం చేయండి**

ఐరాల: గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ నాగరాజు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక చేయడంపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రణాళికల రూపకల్పనలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో అవసరమైన పనులను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా నమోదు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెలాఖరులోపు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, ఏఓ సుజాత పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పక్కాగా కులగణన



ఈవీఎంలపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగర పాలక సంస్థ పరిధిలో కులగణన సర్వేను క్షేత్రస్థాయిలో పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ అరుణ సూపర్‌వైజర్ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. కులగణన సర్వేపై గురువారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న కులగణన సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోనూ శుక్రవారం ఉదయం నుంచి ప్రతి వలంటీర్ క్లస్టర్లో సర్వే కచ్చితంగా ప్రారంభం కావాలన్నారు. వలంటీర్ యాప్‌లో నిర్దేశించిన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. కులగణన సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని, సూపర్‌వైజర్ అధికారులు ఎప్పటికప్పుడు సర్వే జరుగుతున్న తీరుపై పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్వో లోకేష్, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఈవీఎంల వినియోగంపై అవగాహన**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నగర కమిషనర్ అరుణ అన్నారు. నగర పాలక కార్యాలయంలో గురువారం సాయంత్రం ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై కమిషనర్ అవగాహన కల్పించారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్వో లోకేష్, డీఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

### 22న సంప్రోక్షణ మహోత్సవం



అభయ ఆంజనేయస్వామి విగ్రహం

తవణంపల్లె: మండలంలోని టి. పుత్తూరు శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానం ఆవరణంలో 34 అడుగుల ఎత్తయిన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహం సంప్రోక్షణ మహోత్సవం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు. వేద పండితులచే నూతన విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

వెదురుకుప్పం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వెదురుకుప్పంలో గురువారం మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానశాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, మామిడి సాగులో వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పూత ప్రారంభమయ్యే అవకాశం ఉందని, వాతావరణ మార్పులకు అనుగుణంగా పూత రాలిపోకుండా మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 29 మండలాల్లో మామిడి ప్రధాన పంట అని తెలిపారు. నాణ్యమైన దిగుబడి పొందేందుకు రైతులు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



చిత్తూరు అర్బన్: గంగధారనెల్లూరు మండలంలోని ఎట్టేరిలో గురువారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నీలకంఠయ్య ఇంటి ఆవరణలో 86 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. దీంతో మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు, రాంప్రసాద్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.62కోట్లు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.1.62 కోట్లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో గత 22 రోజుల హుండీ కానుకల లెక్కింపును గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. అందులో బంగారం 57 గ్రాములు, వెండి 580 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 964 డాలర్లు, ఆస్ట్రేలియా 60 డాలర్లు, ఇంగ్లాండ్ 60 పౌండ్స్, యూఏఈ 5 ధీరమ్స్, సింగపూర్ 57 డాలర్లు, మలేషియా 1 రింగిట్స్, కెనడా 10 డాలర్లతో కలిపి మొత్తం రూ.1.62 కోట్లు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ లు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, ధనుంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, దేవస్థాన సిబ్బంది, కాణిపాకం ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓవర్ బ్రిడ్జిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు వివరాల మేరకు.. చిత్తూరు ఆర్టీసీ బస్టాండు నుంచి గాంధీ విగ్రహం వరకు వెళ్తున్న వ్యక్తి (40)ని వెనుక వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో ఆ వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# గర్భిణుల సేవలపై నిర్లక్ష్యం వద్దు





సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి, మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: గర్భిణుల సేవలపై నిర్లక్ష్యం వద్దని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో అందించాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ లక్ష్య సాధనకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెఫర్ కేసులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

**శిశు మరణాలపై ఆరా**

నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం శిశు మరణాలపై డీఐఓ రవిరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. శిశుమరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల సంఖ్యను మరింతగా కట్టడి చేయాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో హైరిస్క్( ముప్పు ఉన్న) గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. తల్లికి అధిక రక్తపోటు, రక్తహీనత, పౌష్టికాహారం లోపం వల్ల జరిగే మరణాల నివారణకు గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రసవానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు ఆర్ఎంపీ డాక్టర్ల వద్ద చికిత్స చేయించకూడదన్నారు. 102 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. జననీ సురక్ష యోజన పథకం, ఆరోగ్య ఆసరా పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దీప, స్వాతి, ఉషశ్రీ, లత తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ స్థాయిలోనూ సత్తా చాటాలి

బంగారుపాళెం: మండల స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లోనూ సత్తాచాటాలని ఎంపీపీ అమరావతి అన్నారు. ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో క్రీడా పరికరాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ, గ్రామీణుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది ఉన్నారనే విషయాన్ని గుర్తించి అటువంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను మండల స్థాయిలో నిర్వహించామన్నారు. అందులో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లను నియోజకవర్గ పోటీలకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయ రెడ్డి, నారే సోమశేఖర్, ఎస్ఆర్ఐ భరత్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.





బంగారుపాళెం: క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరైన క్రీడాకారులు